క్లుప్తంగా

ఆర్టీసీ నూజివీడు డిపో నుంచి కార్గో సర్వీసు

నూజివీడు: ఆర్టీసీ నూజివీడు డిపో నుంచి కార్గో సర్వీసును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్ కుమార్ తెలిపారు. ఈ కార్గో సర్వీసు ద్వారా నూజివీడు నుంచి అన్ని ప్రాంతాలకు సరుకు రవాణా చేయవచ్చన్నారు. 10 టన్నుల బల్క్ బుకింగ్ ఉన్నా కూడా బుక్ చేసుకొని రవాణా చేస్తామని తెలిపారు. 95506 09994, 63036 38485, 73829 04016, 73829 01634, 93909 01622లో సంప్రదించాలని కోరారు.

క్రీడా సామగ్రి అందజేత

జి.కొండూరు: చెర్వుమాధవరం, గడ్డమణుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు గెయిల్ ఇండియా సృజనా లేడీస్ క్లబ్ జి.కొండూరు వారి సౌజన్యంతో క్రీడా సామగ్రిని బుధవారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గెయిల్ సీజీఎం ఎల్ఎస్ రావు, డీసీఎం జీడీ వాసు పాల్గొని ప్రసంగించారు. లేడీస్ క్లబ్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

5న వాహనాల వేలం

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 5వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ పి.శ్రీను తెలిపారు. వేలంలో ఒక కారు, 5 ఆటోలు, 12 టూవీలర్స్ మొత్తం 18 వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. వారు టూ వీలర్స్‌కు రూ.5 వేలు, త్రీ, ఫోర్ వీలర్స్‌కు రూ.10వేలు (రిఫండబుల్) డిపాజిట్ ముందుగా చెల్లించాలి. అదనంగా 18 శాతం జీఎస్టీ చెల్లించాలన్నారు. 93476 16844, 98663 72766 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎలుకల నిర్మూలనతో పంటలకు రక్షణ

ముసుకుళ్ల(తిరువూరురూరల్): రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలనకు చర్యలు తీసుకుంటే పంటనష్టాన్ని అధిగమించవచ్చని వ్యవసాయశాఖ జిల్లా సాంకేతిక అధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని మునుకుళ్లలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం జరిగింది. వరిపైరులో వచ్చే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. వ్యవసాయాధికారులు పద్మ, టిప్పుసుల్తాన్, సురేష్ పాల్గొన్నారు.

రబ్బీషు అక్రమంగా తరలిస్తున్న లారీలు సీజ్

విజయవాడరూరల్: కొత్తూరు, తాడేపల్లి, వేమవరం గ్రామాల్లో అక్రమంగా రబ్బీషును లారీల్లో తరలిస్తుండటంతో విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి తన సిబ్బందితో వెళ్లి ఐదు లారీలను మంగళవారం సీజ్ చేశారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ వేమవరం గ్రామం వద్ద మెరుపు దాడి చేసి రబ్బీషు లారీలను తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ఆ లారీలను సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిమానా విధించారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్‌సింగ్, వీఆర్వోలు నాగేంద్రబాబు, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'

మైలవరం: కార్మికుల హక్కుల కోసం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, ఉపాధి హామీ పథకం కింద 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.ఆంజనేయులు కోరారు. మైలవరం ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు తీవ్ర సంక్షోభంలో పడిపోయారన్నారు. కేంద్రం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసిందని చెప్పారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సుధాకరరావు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం

ఆగిరిపల్లి: వర్గీకరణ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని మాదిగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మాదిగ అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉదయగిరి కృపారావు మాట్లాడుతూ మాదిగ అమర వీరుల పోరాటం వృథా అవ్వదని ఎస్సీ వర్గీకరణ సాధిస్తామన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జి కంబాల ప్రదీప్, గిరిజన హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు కలపాల సురేష్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు మల్లంపల్లి రవిశేఖర్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరుల సంస్మరణ సభ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మెయిన్ సెంటర్‌లో నిర్వహించారు. మండల ఇన్‌చార్జి మల్లాది రామారావు మాట్లాడుతూ.. సామాజిక సమానత్వపు పోరులో మాదిగల అస్తిత్వపు ఆత్మ గౌరవ హక్కుల కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరులకు మాదిగ జాతి పక్షాన నివాళులర్పిస్తున్నామన్నారు. ఉత్తరప్రదేశ్‌లో నదిలో స్నానం చేస్తున్న ఒక దళిత బాలికను అసభ్యకరంగా తిట్టి, కొట్టిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మండూరి నాగేశ్వరరావు, పి.రమేష్, దుర్గారావు, చాట్ల రవి, సగ్గుర్తి సుబ్బారావు, ఇస్సాక్, విస్సంపల్లి రవి పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి రుణాలు అందజేత

- డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూత
- రూ.154.59 కోట్ల లక్ష్యానికి రూ.227.42 కోట్లు అందజేత

నూజివీడు: మహిళల ఆర్థిక చేయూత, వారి సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. లక్ష్యానికి మించి లింకేజీ రుణాలను అందించడంతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారు. నూజివీడు నియోజకవర్గంలో లింకేజీ రుణాల లక్ష్యం రూ.154 కోట్లు కాగా, ఇప్పటి వరకు డ్వాక్రా మహిళలు తీసుకున్న మొత్తం రూ.227 కోట్లకు చేరింది. సీనియర్ గ్రూపులకు బ్యాంకులు రూ.20 లక్షలు రుణంగా ఇస్తున్నాయి.


వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సమావేశమైన డ్వాక్రా గ్రూపు సభ్యులు

రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించిన గ్రూపులకు రుణాన్ని మరింత పెంచి ఇస్తున్నాయి.

ప్రభుత్వ తోడ్పాటు సైతం దోహదం

డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం పావలా వడ్డీని క్రమం తప్పకుండా ఇస్తుండడంతో బ్యాంకు రుణాలను బకాయి పడకుండా తిరిగి చెల్లిస్తున్నారు. దీంతో బ్యాంకర్లు కూడా డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు వెనుకాడటం లేదు. నూజివీడు మండలంలో లింకేజీ రుణాలు రూ.37.65 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటికే రూ.72.62 కోట్లు అందించారు. ముసునూరు మండలంలో రూ.41.21 కోట్లకు రూ.45.36 కోట్లు ఇచ్చారు.

ట్రాక్టర్ లోనుకు జమ చేశాం..



మా గ్రూపునకు బ్యాంకు రూ.15 లక్షలు లింకేజీ రుణం ఇవ్వగా, ఒక్కొక్కరికీ రూ.1.50 లక్షలు వచ్చాయి. దీంతో ఆ నగదు ట్రాక్టర్ కొనుగోలు అప్పు నిమిత్తం ఈఎంఐ చెల్లించాం. లింకేజీ రుణాలు కుటుంబ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం కూడా పావలా వడ్డీని క్రమం తప్పకుండా అందిస్తోంది.

– పలగాని లక్ష్మి, శ్రీ ఆంజనేయ పొదుపు సంఘం, గొల్లపల్లి, నూజివీడు మండలం

మరిన్ని రుణాలు అందిస్తాం..



2022–23 ఆర్థిక సంవత్సరంలో డ్వాక్రా సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలను అందజేశాం. తీసుకున్న రుణాలను మహిళలు కొందరు కుటుంబ అవసరాలకు ఉపయోగిస్తుండగా, మరికొందరు చిన్న చిన్న వ్యాపారాలకు వాడుకుంటున్నారు. మరికొందరు పాడి పశువులు కొనుక్కుంటున్నారు. ఈనెల రోజుల్లో మరిన్ని రుణాలు అందించేందుకు చర్యలు తీసుకున్నాం.

– దయాల రాజశేఖర్, ఏరియా కోఆర్డినేటర్, నూజివీడు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

పెనుగొలను(గంపలగూడెం): రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పాలన అందిస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలనులో రెండో రోజైన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తూ గ్రామంలోని బీసీ కాలనీ, పంచాయతీ కార్యాలయం, ఊటుకూరు రహదారుల వెంట ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. గతంలో ఎన్నాడు లేనివిధంగా తెల్లవారు జామునే లబ్ధిదారుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారన్నారు. దీనిపై పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందక పోతే వెంటనే దరఖాస్తు చేసుకుంటే తిరిగి పథకాలు మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే వచ్చే సాధారణ ఎన్నికల్లో మారోమారు


పెనుగొలనులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

వైఎస్సార్ సీపీని ఓటర్లు బలపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కె.శామ్యూల్, సర్పంచ్ సంగెపు లలిత, ఎంపీటీసీ సభ్యులు వి.శ్రీను, సొసైటీ అధ్యక్షుడు వి.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, నాయకులు జూలూరు ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వరరావు, జొన్నల ప్రతాపరెడ్డి, సీహెచ్ నరసారెడ్డి, ఏ.కోటేశ్వరరావు, నల్లగట్ల బాలు, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, ఎస్ఐ వి.సతీష్ పాల్గొన్నారు.

వేకువ జాము నుంచే పింఛన్ల పంపిణీ

మైలవరం: మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల పరిధిలో బుధవారం వేకువ జాము నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను అందజేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. మైలవరం మండలంలో 85 శాతం పెన్షన్‌లు పంపిణీ చేశామని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మైలవరం మండలంలో 9,627 మంది పెన్షన్‌దారులు ఉన్నారని, వీరికి రూ.2,66,32,250 మంజూరయ్యాయన్నారు.

కొండపల్లిలో 80 శాతానికి పైగా..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం 10 గ్రామాల్లో 4,709 మందికి గాను 3,124 మందికి 66.34 శాతం పంపిణీ జరిగినట్లు ఎంపీడీఓ రామకృష్ణనాయక్ తెలిపారు. కొండపల్లి 29 వార్డుల్లో 5,142 మందికి గాను 4,123 మందికి 80.18 శాతం పింఛన్ పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

జి.కొండూరులో 91శాతం పూర్తి

జి.కొండూరు: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 8,505 మంది పింఛన్ లబ్ధిదారులు


కందులపాడు గ్రామంలో లబ్ధిదారుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్


నూజివీడు పట్టణం ఎమ్మార్ అప్పారావు కాలనీలో పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్

ఉండగా బుధవారం 7,745 మందికి గ్రామ వలంటీర్లు పింఛన్‌లను పంపిణీ చేశారని ఎంపీడీఓ అనూరాధ తెలిపారు. తొలి రోజు 91 శాతం పంపిణీ పూర్తయిందన్నారు.

తిరువూరులో 90 శాతం

తిరువూరు: మండలంలో 14 వేల మంది పెన్షనర్లుండగా, 90 శాతం మందికి తొలిరోజే నగదు అందజేశామని అధికారులు తెలిపారు. ఇతర ప్రాంతాల్లో, ఆస్పత్రుల్లో ఉన్న వారికి కూడా రెండు రోజుల్లో పెన్షను సొమ్ము అందజేస్తామని పేర్కొన్నారు.

విస్సన్నపేటలో 91 శాతం

విస్సన్నపేట: మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయినట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేశారన్నారు.

గంపలగూడెంలో 90 శాతం

గంపలగూడెం: మండలంలో 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. మండలంలో 11,249 మంది ఫించన్‌దారులకు రూ. 3,10,43,500 మంజూరైందన్నారు. మిగిలిన వారికి ఈనెల ఐదో తేదీ లోపు వలంటీర్లు నగదు పంపిణీ చేస్తారన్నారు.

నూజివీడులో 85 శాతానికి పైగా..

నూజివీడు: నూజివీడు మండలంలో 86 శాతం, నూజివీడులో 87 శాతం పంపిణీ చేశారు. మండలంలో 10,493 పింఛన్లకు 9,048, నూజివీడులో 5,154 పింఛన్లకు 4,452 పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు.

పార్టీలకతీతంగా పింఛన్లు..

ఆగిరిపల్లి: పార్టీలకతీతంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు సచివాలయాల మండల కన్వీనర్ నందూరి భాస్కర్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని 9,630 మంది లబ్ధిదారుల్లో 7,700 మందికి 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ సలాం తెలిపారు.

పింఛన్లతో పేదలకు మేలు

ముసునూరు: అర్హులందరికీ పింఛన్ల పథకం పేదలకు మేలు చేస్తుందని ఎంపీపీ ఆర్ కృష్ణకుమారి సుబ్బారావు, చింతలవల్లి సర్పంచ్ సత్యనారాయణ పేర్కొన్నారు. 7,838 పింఛన్లకు 6,001 మందికి 76.56 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ గుంజి రాణి తెలిపారు.


మైలవరంలో లబ్ధిదారుడు బడేమియాకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ జరీనా

ఆస్పత్రిలో పెన్షన్ అందజేత



వామకుంట్ల(తిరువూరురూరల్): మండలంలోని వామకుంట్లకు చెందిన మందా ఈశ్వరమ్మ అనే మహిళ అనారోగ్యం కారణంగా విజయవాడలో చికిత్స పొందుతుండగా, వైఎస్ఆర్ పెన్షన్ కానుక నగదును బుధవారం వలంటీర్ బండి శ్రీనివాసరావు అందజేశారు. ఈశ్వరమ్మ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ ధరకే భూ సేకరణ

జి.కొండూరు: విజయవాడ–ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా రైతుల నుంచి సేకరించనున్న భూమికి మార్కెట్ ధరను ఇచ్చేందుకు ప్రతిపాదన చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని దుగ్గిరాలపాడు, పెట్రంపాడు, గంగినేనిపాలెం, తెల్లదేవరపాడు, సున్నంపాడు గ్రామాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం సేకరించనున్న భూమికి రైతులకు మార్కెట్ ధర ఇచ్చే ప్రతిపాదనపై స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిణీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.


దుగ్గిరాలపాడులో భూమిని పరిశీలిస్తున్న జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్

నిమ్రాలో 'వన క్షేమం – మన క్షేమం'

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వన క్షేమం – మన క్షేమం కార్యక్రమం బుధవారం జరిగింది. కళాశాల అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణమూర్తి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత స్వీకరించాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వాటిని సంరక్షించే బాధ్యతను విద్యార్థులు స్వీకరించారు. మొక్కలు నాటుదాం పర్యావరణం పరిరక్షిద్దాం అని నినాదాలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అక్బర్ ఖాన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఎల్బీఆర్సీఈకి సిస్కో అకాడమీ అవార్డు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు సిస్కో అకాడమీ అవార్డు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బెంగళూరులో ఇటీవల జరిగిన 25వ సిస్కో అకాడమీ వార్షికోత్సవాల్లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు సిస్కో నెట్‌వర్కింగ్ బెస్ట్ అకాడమీ అవార్డు అందజేశారన్నారు. ఈ అవార్డుకు కృషి చేసిన అధ్యాపకులు కె.ఫణీంద్ర, ఎస్. శ్రీకాంత్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, డాక్టరేట్స్, ప్రిన్సిపాల్ అప్పారావు, డీన్ ఆఫ్ అకాడమిక్స్ శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి వీరయ్య, ఐటీ విభాగాధిపతి శ్రీనివాసరావు, కళాశాల స్పోక్స్‌పర్సన్ నాగాంజనేయులు అభినందించారు.


అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

జి.కొండూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మండల పరిధి కవులూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యే వసంత, ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయతే వైఎస్సార్ సీపీకి వెన్నెముక అన్నారు. గతంలో ప్రజలు ప్రభుత్వ సేవలు పొందాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ప్రస్తుతం ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన వచ్చేలా ముఖ్యమంత్రి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేశారని చెప్పారు.


కవులూరులో ప్రభుత్వ పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వంపై నిత్యం దుష్ప్రచారాలు చేసే దుష్ట శక్తులను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు గ్రామ సచివాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పథకాలు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన ఉపాధి అవకాశాలు

మైలవరం: యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు సృష్టించే విధంగా కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రూపొందించారని కొచ్చిన్ యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ పి.అరుణాచలం తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ అరుణాచలం మాట్లాడుతూ.. అమృత్ కాలల్ లక్ష్యంగా 7 ప్రధాన అంశాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. దేశాన్ని సబ్ కా సాత్ వికాస్ ఆర్థికాభివృద్ధి 7 శాతం సాధించే విధంగా, విదేశీ పెట్టుబడులు ఆకర్షించే విధంగా బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి ప్రసంగించారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ షేక్ కరీముల్లా, ఎం.శ్రీనివాసరావు, జి.నారాయణరావు ప్రసంగించారు. అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

రామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): గ్రామంలో పురాతన కోదండ రామాలయం పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం భూమిపూజ చేశారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన కోదండ రామాలయం జీర్ణోద్ధరణకు చేరడంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని భక్తులు, గ్రామస్తులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా భూమిపూజ చేయించారు. సర్పంచ్ బొమ్ము వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.


తుమ్మలపాలెంలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, నాయకులు

6 నుంచి అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు

తిరువూరు: స్థానిక రాజుపేటలో వేం చేసి ఉన్న శ్రీఅష్టలక్ష్మి ఆలయ 14వ వార్షికోత్సవాలను ఈ నెల 6 నుంచి నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త కాసులనాటి పద్మనాభశర్మ తెలిపారు. 6న అంకురార్పణ, 7న శ్రీలక్ష్మీ నారాయణ స్వామి కల్యాణం, అన్నదానం, 8న దేవతా హోమాలు, సువాసినీ పూజ, పూర్ణాహుతి జరుగుతుందన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ

నూజివీడు: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రమాదం సంభవించినప్పుడు ప్రాణాపాయం నుంచి బయట పడొచ్చని రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. నూజివీడు మండలం దేవరగుంట స్టేజీ వద్ద బుధవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోతే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు.

వైభవంగా విగ్రహాలు, ధ్వజస్తంభాల ప్రతిష్ఠ

ముసునూరు: శ్రీ హనుమత్ సమేత సీతా రామలక్ష్మణ కోదండ రామస్వామి ఆలయానికి భక్తులు సంప్రదాయ సిద్ధంగా, భక్తిశ్రద్ధలతో ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో 1998లో నిర్మించిన కోదండ రామాలయంలో గత మూడు రోజులుగా అభిషేకాలు, హోమం, ప్రత్యేక పూజాధికాలు జరిపారు. భక్తుల రామ నామ స్మరణ, పురోహితుల వేద మంత్రోచ్ఛరణలు, బాజా భజంత్రీల మేళతాళాల నడుమ బుధవారం స్వామి ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. గ్రామ రైతు ప్రముఖులు మాదల మదన్ మోహనరావు, ఫణీంద్ర దంపతులు రూ.8 లక్షల సొంత నిధులతో ఆలయంలో ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేయించారు. 10 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

వావిలాల(తిరువూరురూరల్): మండలంలోని వావిలాల శివారు రాజుగూడెంలో పునర్నిర్మించిన శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. దాతల సహకారంతో నిర్మించిన ఆలయంలో ఆంజనేయ సహిత శ్రీసీతారామచంద్రస్వాముల దేవతా విగ్రహాలను, ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే రక్షణనిధి, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.


చెక్కపల్లిలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ


రాజుగూడెంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

తిరువూరులో..

తిరువూరు: తిరువూరులో పునర్నిర్మించిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయంలో బుధవారం ధ్వజస్తంభం, శిఖర, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. 1957లో నిర్మించిన ఈ ఆలయం జీర్ణావస్థకు చేరడంతో వంశపారంపర్య ధర్మకర్త దారా రంగారావు ఆధ్వర్యంలో దాతల విరాళాలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆచార్య రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు భూనీళా సమేత శ్రీరంగనాయకస్వామి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, గోదా కృష్ణ పరమాత్మ, గరుడాంజనేయస్వామి, రామానుజస్వామి, నమ్మాళ్వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.


తిరువూరులో రంగనాయకస్వామి ఆలయంలో..

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. ఓ ప్రైవేటు విత్తన కంపెనీలో పని చేస్తోన్న బలివే శివారు రంగంపేటకు చెందిన జక్కుల వెంకటేశ్వరరావు ఫిబ్రవరి 15న పెళ్లి వెళుతున్నట్లు చెప్పి ఇంటి వద్ద నుంచి వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. అతని తల్లి రాటాలు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

120 మందికి వైద్య పరీక్షలు

చంద్రాల(మైలవరం): మండల పరిధిలోని చంద్రాల గ్రామంలో గ్రేస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎంఎం చర్చిలో బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 30 మందికి కంటి శుక్లాలు గుర్తించి చుక్కల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వివిధ వ్యాధులకు మందులు అందజేశారు.